క్లుప్తంగా

ప్రధానితో చర్చ కార్యక్రమానికి పేర్ల నమోదు

రాజమహేంద్రవరం రూరల్: ప్రధానితో పరీక్షాపే చర్చ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జనవరి 14వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి 12వ తరగతి వరకూ ప్రభుత్వ, గ్రాంట్ ఇన్ ఎయిడ్, స్టేట్ సెకండరీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దీనికి అర్హులని వివరించారు. ఇందులో పాల్గొనే విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. విద్యాపరమైన సవాళ్లు, వినూత్న పరిష్కారాలు, స్ఫూర్తిదాయ కథనాలపై ప్రధానితో చర్చించవచ్చన్నారు. ఆసక్తిగలవారు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఐఎన్ఎస్‌టీపీఏటీఐవిఈఐఎన్‌డిఐఏ1. ఎంవైజీవోవీ.ఐఎన్ అధికారిక పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారిలో ఎంపికైన వారికి వారి ఇమెయిల్ లేదా వెబ్‌సైట్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం తెలియజేస్తారన్నారు. దేశవ్యాప్తంగా 2,500 మంది విద్యార్థులకు ఈచర్చా కార్యక్రమం కిట్లు అందిస్తారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, ఎంఈవోలు శ్రద్ధ తీసుకుని అర్హతగల ప్రతి విద్యార్థి పేరును పరీక్షా పే చర్చా–2025 వెబ్‌సైట్‌లో నమోదు చేయించాలని కోరారు. నమోదు ప్రక్రియకు సంబంధించి మరిన్ని వివరాలకు డైట్ అధ్యాపకులు డీఎస్‌వీ సత్యనారాయణ 73864 99001, జే.కళావతి 98492 11774 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ కోరారు.

గణిత ఒలింపియాడ్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు



ర్యాంకులు సాధించిన శ్రీ షిర్డీ సాయి విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అసోసియేషన్ ఫర్ ఇంప్రూవ్ మెంట్ ఆఫ్ మేథమెటిక్స్ ఎడ్యుకేషన్ (ఏఐఎంఈడీ) ఏటా నిర్వహించే గణిత ఒలింపియాడ్‌లో రాజమహేంద్రవరం శ్రీ షిర్డీ సాయి విద్యాసంస్థల విద్యార్థులు పలు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య ఆదివారం వెల్లడించారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి.జయంత్ అశ్విన్, జి.శ్రీఅంజలి, ప్రణయ రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకును కైవసం చేసుకున్నారన్నారు. 10వ తరగతి చదువుతున్న ఐ.కశ్యప్ వంశీ, 7వ తరగతి చదువుతున్న జి.అనూష, నాగ లిఖిత రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు సాధించగా, 9వ తరగతి చదువుతున్న కేపీవీ ప్రియాంక, 7వతరగతి చదువుతున్న సీహెచ్‌ఆర్ఎస్ షణ్ముఖ్, ఒ.ఆర్నవ్‌సాయి రాష్ట్ర స్థాయి 3వ ర్యాంకును కైవసం చేసుకున్నారన్నారు. తమ విద్యార్థులు వివిధ పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడంపై విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులను అందుకు కృషిచేసిన ఉపాధ్యాయ బృందాన్ని శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యా డీన్ కె.శ్రీనివాస్ అభినందించారు.

ఉద్యోగాలు కోల్పోయిన వారి ఆశలన్నీ సీఎంపైనే

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగం కోల్పోయిన వైద్య ఆరోగ్య శాఖలోని ఆరోగ్యసహాయకుల ఆశలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పైనే వున్నాయని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ.వీ.వీ.ప్రసాద్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది ఆరోగ్య సహాయకుల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో త్రిశంకుస్వర్గంలో కొట్టుమిట్టాడుతున్న విషయాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలోని దాదాపు వెయ్యి మంది కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను రాత్రికి రాత్రి హడావుడిగా ఉద్యోగాల నుంచి తొలగించడంతో ఆ కుటుంబాలన్నీ ఒక్కసారిగా రోడ్డున పడ్డాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు చేసిన తప్పిదాలకు ఎందరినో బలి చేయడం ఎంతవరకూ న్యాయమని ప్రశ్నిస్తూ, జరిగిన అన్యాయాన్ని తాను నేరుగా ముఖ్యమంత్రి దృష్టికే తీసుకెళ్లానని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నేత ప్రసాద్ చెప్పారు. ముఖ్యమంత్రి తప్పక న్యాయం చేస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రకాశం నగర్ : కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో సర్కారు విఫలమైందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మావోభవన్‌లో ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టాన్యా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీల వంటి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ దేశాన్ని సర్వనాశనం చేస్తోందని విమర్శించారు. మహిళలకు చట్ట సభలో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆటల్లోనూ రాణింపు

- కిక్ బాక్సింగ్, యోగ, ఆర్చరీ పోటీల్లో పలు పతకాలు కైవసం
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతున్న వైనం



ఆర్చరీ 30 మీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించిన అజయ్‌ను అభినందిస్తున్న ఎస్‌కేవీటీ కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, ఇతర అధ్యాపకులు (పాత చిత్రం)

ప్రకాశంనగర్ : క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభ చూపించి పతకాలు సాధిస్తున్నారు. నగరానికి చెందిన పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఘనత సాధించడం మరో విశేషం. చదువుతో పాటు ఆటల్లోనూ రాణించి పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించడమే కాకుండా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతున్నారు. దీంతో రాజమహేంద్రవరం ఖ్యాతీ జాతీయ స్థాయికి చేరిందని పలువురు క్రీడా విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న తేలం అజయ్ ఈ నెల 12న ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాలల ఆర్చరీ 30 మీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించాడు. జాతీయ స్థాయిలో 50 మీటర్ల ఆర్చరీ పోటీల్లో అజయ్ అర్హత సాధించాడు. ఇదే కళాశాలకు చెందిన బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థి టి. సూర్య అంతర్ కళాశాలల యోగ పోటీల్లో బంగారు పతకం సాధించగా, ఈ పోటీల్లో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతున్న జి.శంకర్‌స్వామి కాంస్య పతకం సాధించాడు. వీరు ఈ నెల 23న భువనేశ్వర్‌లో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొననున్నారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణ మూర్తి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

కిక్ బాక్సింగ్‌లో ఆల్ రౌండ్ చాంపియన్ షిప్

కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఇటీవల జరిగిన ఇంటర్ కాలేజీ ఎట్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ఐదుగురు బంగారు, ఇద్దరు వెండి, ఒకరు కాంస్య పతకాలు సాధించి ఆల్ రౌండ్ చాంపియన్ షిప్ సాధించారు. వీరిలో సీహెచ్ గీతా, ఎం. ధనలక్ష్మి, ఎ.రామలక్ష్మి, కె. సత్యవేణి, కె.భవ్య బంగారు పతకాలు సాధించగా, కె.దీక్షిత, వి.ఇందు వెండి పతకాలు, ఎస్.ప్రసన్నకుమారి కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. బంగారు పతకాలు సాధించిన ఐదుగురు విద్యార్థినులు ఫిబ్రవరిలో పంజాబ్‌లో జరిగే ఆలిండియా కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు.

కొరవడిన ప్రభుత్వ సహాయం

క్రీడాల్లో విద్యార్థులు రాణిస్తున్నప్పటికి ప్రభుత్వం నుంచి అందవలిసిన సహాయ సహకారాలు అందకపోవడంతో క్రీడాకారులు, కోచ్‌లు ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పలు క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు క్రీడలకు సంబంధించిన సామగ్రిని అందజేయడం వారికి కావలసిన అల్పాహారం, భోజన వసతి వంటి సౌకర్యాలు ప్రభుత్వమే కల్పించేది. గ్రామీణ స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు జిల్లా స్థాయిలో నగదు బహుమతులు సైతం అందించింది. క్రీడాకారులు ఆయా పోటీల్లో ప్రతిభ చూపినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం వారికి అవసరమైన శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహం అందించడంలో వంటి విషయాల్లో ఊదాసీనంగా వ్యవహరిస్తోందని క్రీడాభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంచి భవిష్యత్తు ఉంటుంది



ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించినవారికి మంచి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా బాలురతో పాటు బాలికలు ఆయా క్రీడల్లో రాణించి పతకాలు సాధించడం అభినందనీయం. గతంతో పోలిస్తే ఇప్పుడు యువత క్రీడలపై ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతోపాటు ఆటల్లోను శిక్షణ ఇచ్చేందుకు ప్రోత్సహం అందించాలి.

– ఎస్ఆర్‌కే స్వామి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి

శారదాదేవి జయంత్యుత్సవం

సీటీఆర్ఐ: స్థానిక కోరుకొండ రోడ్డులో గల శ్రీరామకృష్ణ మఠంలో శారదామాత 172వ జయంతి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మంగళహారతి, సుప్రభాతం, వేద పఠనం, విశేష పూజ నిర్వహించారు. స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్, శారదామాల జీవితం సందేశంపై ప్రసంగించారు. అనంతరం 700 మంది భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం పుష్కర ఘాట్ వద్ద గల శారదా మండపంలో శారదా మాతకు హారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి రఘువీరానందజీ, స్వామి సేవ్యానందజీ పాల్గొన్నారు.

సింహాద్రి రామలక్ష్మికి పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: పుత్రవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ మహిళానాయకురాలు సింహాద్రి రామలక్ష్మిని ఆదివారం రాజవోలు గాయత్రినగర్‌లోని ఆమె నివాసంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగశ్వర్ పరామర్శించారు. ఇటీవల రామలక్ష్మి కుమారుడు రాము అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో చందన నాగేశ్వర్ ఆమెను పరామర్శించి రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యలరాజేష్, మత్సేటిశివ పాల్గొన్నారు.

వాసవీ ఇంటర్నేషనల్‌కి 111 అవార్డులు



అవార్డులను చూపిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రవీణ్ కుమార్, సాయిసూర్యప్రకాష్ తదితరులు

సీటీఆర్ఐ: సమాజంలో వాసవీ క్లబ్‌లు విస్తృత సేవలు అందిస్తున్నాయని, వాసవీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 215ఏ కి ఈ ఏడాది చేసిన సేవలను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో డిస్ట్రిక్ట్‌కి 111అవార్డులు లభించాయని డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్ళకూరి కెవిపిఆర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. లాలాచెరువు రోడ్డులోని వైశ్యా హాస్టల్‌లో ఆదివారం సాయంత్రం వాసవీ క్లబ్స్ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వాసవీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ కె.రవిచంద్రన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ ఏడాది పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. తమ సేవలను గుర్తించిన వాసవీ ఇంటర్నేషనల్ 111 అవార్డులు ప్రకటించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అలాగే 2025కి ఇంటర్నేషనల్ సెక్రటరీగా బోడా సాయిసూర్య ప్రకాష్ నియమితులవ్వడం అనందంగా ఉందన్నారు. బోడా సాయి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో 111 అవార్డులు రావడం ఇదే తొలిసారి అన్నారు. అలాగే డిస్ట్రిక్ట్ లెవల్ లో కూడా అవార్డులు అందజేయడం ఆనందదాయకమన్నారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బాలనాగు కాశీ విశ్వేశ్వరరావు, మానేపల్లి రమేష్, డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీ సురేష్, వైస్ గవర్నర్ యండూరి రాఘవకుమారి, రాణి, డిస్ట్రిక్ట్ కేబినెట్ ట్రెజరర్ ప్రశాంత్, రీజనల్ చైర్మన్లు చంద్ర గుప్త, సుధీర్ , పలువురు వాసవీయన్లు పాల్గొన్నారు.

అక్షరం గౌరవిస్తోంది.. శిక్షిస్తోంది.. రక్షిస్తోంది..

- కేరింతల మధ్య పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సీటీఆర్ఐ: మనం నేర్చుకునే అక్షరం మనల్ని గౌరవించేలా చేస్తుంది.. మనల్ని రక్షిస్తుంది... అదే అక్షరం మనల్ని శిక్షిస్తోందని రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత, విశ్రాంత బోటనీ ఉపాధ్యాయుడు డాక్టర్ కృష్ణంరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆదివారం 1994 చెందిన ఇంటర్మీడియెట్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. అనాటి చదువులు చెప్పిన ఉపాధ్యాయులను గౌరవంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో చదువుకోవడానికి వస్తున్నారో... చనువు పెంచుకోవడానికి వస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ సీటు తెచ్చుకోవడం అంటే ఆ విద్యార్థి ఉత్తమ విద్యార్థి అయి ఉంటారన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చదివిన కళాశాలలో మీరు చదవడం, మీకు పాఠాలు బోధించడం మనందరి అదృష్టం అన్నారు. ముఖ్యంగా బైపీసీ, ఎంపీసీకి చెందిన విద్యార్థులు తమ లక్ష్యాలు సాధించడానికి ఆహోరాత్రులు కృషి చేసేవారన్నారు. మీలో చాలామంది డాక్టర్లు, డాక్టరేట్‌లు, వివిధ వృత్తులలో స్థిరపడ్డ వారు చాలామంది ఉన్నారన్నారు. కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలు సరోజని మాట్లాడుతూ ఆ రోజుల్లో మీకు విద్యను బోధించనందుకు ఇప్పుడు చాలా ఆనందపడుతున్నారన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు చదువుకున్న రోజుల్లో గడిపిన క్షణాలు గుర్తుకు తెచ్చుకున్నారు. విశ్రాంత ఉపాధ్యయులు ప్రసాద్, సీతారామయ్య, మల్లేశ్వరి, కె.నాగేశ్వరరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో బంగారం షాపులో చోరీ

70 గ్రాముల బంగారు నగలను ఎత్తుకెళ్లిన ముగ్గురు మహిళలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బంగారం కొనుగోలు చేసేందుకు వచ్చిన ముగ్గురు మహిళలు సుమారు 70 గ్రాముల బంగారు ఆభరణాలను సినీ ఫక్కీలో చోరీ చేసిన సంఘటన ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక గుండువారి వీధిలోని వెంకటసాయి లక్ష్మీ జ్యూయలరీకి సాయంత్రం సమయంలో ముగ్గురు మహిళలు బురకాలు ధరించి బంగారు నగలు కొనుక్కునే వారిలా వచ్చారు. వారు చాలా సమయం దుకాణంలో బంగారు ఆభరణాలను చూసుకున్నారు. చివరికి ఏమీ నచ్చనట్లు చెప్పి వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయిన కొద్ది సమయానికి దుకాణంలోని కొన్ని బంగారు ఆభరణాలు కనిపించలేదు. దుకాణంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. వాటి ఆధారంగా ఆ బురకా వేసుకున్న మహిళలు బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే దుకాణ యజమాని శ్రీనితిన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యలు తీర్చడానికి కృషి

కమిషనర్ కేతన్ గార్గ్



ముఖ్య కూడళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ట్రాఫిక్ సమస్యలు తీర్చడానికి ప్రణాళిక తయారు చేస్తున్నట్లు కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. ఆదివారం ట్రాఫిక్, నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగు, పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులతో కలిసి నగరంలో ముఖ్య కూడళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ముఖ్య కూడళ్లలో పార్కింగు సమస్య అధికంగా ఉందని, ప్రజలు తమ వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుదల చేస్తున్నారని గుర్తించామన్నారు. ప్రమాదాలు జరగడం, వాహనదారుల మధ్య గొడవలు జరగడం నిత్యం గమనిస్తున్నామన్నారు. వీటన్నింటికీ పరిష్కారం కనుగొనే విధంగా ప్రణాళిక రచిస్తామన్నారు. ప్రజలు తమ వాహనాలను కూడళ్లకు 50 అడుగుల దూరంలో నిలిపి ఉంచడానికి స్థలం కేటాయిస్తామన్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు వేరు వేరుగా నిలిపేలా చూస్తామని అందువలన పాదచారులకు ఎటువంటి సమస్య లేకుండా ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన పరికరాలు, సామగ్రి వివరాలు పూర్తి స్థాయిలో తయారు చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ ప్రణాళికా విభాగం, ట్రాఫిక్ పోలీసు విభాగం సమష్టిగా కృషి చేయాలని అన్నారు. సిటీ ప్లానరు జి.కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానరు సీహెచ్ సత్యనారాయణరాజు, మునిసిపల్ హెల్త్ ఆఫీసరు ఎ.వినూత్న, ట్రాఫిక్ పోలీసు విభాగం అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

కడియం: మహిళలు అన్ని రంగాల్లో సామాజిక ఆర్థిక అభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాస్ అన్నారు. కడియంలో మండల మహిళా సమాఖ్య భవనంలో డీఆర్‌డీఏ పీడీ, కడియం ఎంపీపీ ఆదేశాలతో యూనియన్ బ్యాంక్‌గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 30మంది మహిళలకు కొవ్వొత్తుల తయారీశిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో సంస్థ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీఎం మూర నాగ భూషణం, శిక్షకురాలు ఖాదిర్ బీ, పద్మారావు, కొండేటి ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రస్టు సభ్యుల ఆత్మీయ కలయిక

రాజమహేంద్రవరం రూరల్: సత్య చారిటబుట్ ట్రస్టు సభ్యుల ఆత్మీయ కలయిక శాటిలైట్‌సిటీలోని ఒక స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. రెండేళ్ల క్రితం స్థాపించిన సత్య చారిటబుట్ ట్రస్టు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలలో చేపట్టిన సేవాకార్యక్రమాల గురించి చర్చించి, విజయవంతంగా నిర్వహించడంపై సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కొత్త ఏడాదిలో చేపట్టబోయే సేవాకార్యక్రమాల గురించి చర్చించుకున్నారు. ట్రస్టును స్థాపించిన తమ్మారవి, విజయలక్ష్మి దంపతులను సత్కరించారు. వారు ట్రస్టుకు కార్పస్‌ఫండ్ కింద రూ.50వేలను విరాళంగా అందజేశారు. కృష్ణామాచార్యులు,మంగతాయారు దంపతులు రూ.3వేలు విరాళం అందజేశారు. ప్రముఖ సంఘసేవకులు మార్నివాసుదేవ్, ఏపీ దూరదర్శన్–1 డైరెక్టర్ డా.జీకేరావు, జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ ఓ.కేదారేశ్వరరావు, సత్య చారిటబుల్ ట్రస్టు హైదరాబాద్ విభాగం అధ్యక్షుడు సూర్యప్రకాష్, ఈసీ మెంబర్ పి.భరద్వాజ పాల్గొన్నారు.

వినియోగదారుల అవగాహన వారోత్సవాలు

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వినియోగదారుల క్లబ్, వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ, విద్యార్థులతో వినియోగదారుల అవగాహన ప్రతిజ్ఞ నిర్వహించారు. వ్యాసరచన వక్తృత్వం, క్విజ్, పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ వారోత్సవాలు ఈ నెల 24వ తేదీ వరకు జరుగుతాయని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే ఈ సందర్భంగా తెలిపారు. వినియోగదారుల అవగాహన నిమిత్తం ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. డీసీపీసీమెంబర్ జి.అనంతరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.శ్రీరామమూర్తి, వాణిజ్యశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ పీవీ వీ.సత్యనారాయణ, కన్స్యూమర్ క్లబ్ కోఆర్డినేటర్స్ సీహెచ్.శ్రీరామ్‌పవన్, వి.రమేష్‌కృష్ణ, బి.సుజాత, ఏ.శ్రీనివాసరావు, కె రాజేశ్వరి, వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుక

కడియం: స్థానిక హైస్కూల్ వెనుక గల షారోను దైవిక స్వస్థత శాలలో ఆదివారం క్రిస్మస్ వేడుక ఆత్మీయంగా జరిగింది. రెవ డాక్టర్ రత్నరాజు వాక్యోపదేశం చేశారు. కేక్ కటింగ్, కేండిలైట్ అనంతరం కుమారి సుజనీస్వాతి చేతులమీదుగా వస్త్రాల బహుమతి జరిగింది. సండే స్కూలు పిల్లల కంఠత వాక్యాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గౌరి, సీత, షారోన్, వివేక్, డెబోరా, సుజన్ అభిషేక్, భాగ్యశ్రీ పాల్గొనగా సరోజిని అరాధన జరిపించారు.

దంతాల సంరక్షణలో నిర్లక్ష్యం వద్దు

సీటీఆర్ఐ: దంతాల సంరక్షణలో నిర్లక్ష్యం వహించవద్దని డాక్టర్ షేక్ కమల్‌షా అన్నారు. ఆదివారం స్థానిక సంజీవయ్య నగర్‌లోని విశ్రాంత కలెక్టర్ జీవీఎస్‌రావు బిల్డింగ్ వద్ద జూలీ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రజలు ఈ దంత వైద్య శిబిరంలో పాల్గొని ఉచిత చెకప్ చేయించుకున్నారు. వారికి డాక్టర్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ జూలీ అమ్మ మాట్లాడుతూ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలతో పాటు ఉచిత వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి నెలా ఒక్కో రకమైన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇక్కడ ప్రజలకు సేవలు చేస్తున్నామన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

రాజమహేంద్రవరం సిటీ: ప్రత్యామ్నాయ రాజకీయ నిర్మాణంతోనే ప్రజాస్వామ్యానికి భద్రత చేకూరుతుందని జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటివని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆదివారం ఆర్పీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ భారతదేశంలో 45 శాతం ప్రజలు మోదీ పాలనను వ్యతిరేకిస్తున్నారని, మోదీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు కాపలాదారుగా పాలన సాగిస్తుండటంతో మోదీ పాలనలో పేదరికం విస్తృతంగా పెరిగిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ పాలనలో ప్రజలను బిచ్చగాళ్లగా మారుస్తున్నారని, మానవ హక్కులకు, కార్మిక హక్కులకు, భద్రతకు రక్షణ లేదన్నారు. మోదీ పాలనలో బ్యాంక్‌ల్లో సామాన్యుల సొమ్ముకు భద్రత లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హృద్యంగా నృత్యోత్సవాలు



నవ జనార్దన పారిజాతం నృత్య రూపకం

రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జరుగుతున్న కళాప్రియ నృత్య కళాక్షేత్రం సంగీత నృత్యోత్సవాలు రెండో రోజు ఆదివారం హృద్యంగా సాగాయి. నాట్యాచార్యుడు ఆచంట చంద్రశేఖర ఆధ్వర్యంలో నవ జనార్దన పారిజాతం నృత్య రూపకం కళాకారులు ప్రదర్శించారు. అనంతరం నాట్య గురువులను అవార్డులతో సన్మానించారు.

– సాక్షి, రాజమహేంద్రవరం

స్కూల్ అసిస్టెంట్ సువర్ణవేణికి భారతరత్న సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సువర్ణవేణి

కడియం: కర్నాటకలోని శ్రీమాతృ ఫౌండేషన్ సంస్థ వివిధరంగాలలో ఉత్తమసేవలందించిన కడియం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిషు) డాక్టర్ బూసి సువర్ణవేణి భారతరత్న సేవా పురస్కారం –2024 అవార్డు అందుకున్నారు. ఆదివారం బెంగళూరులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో శ్రీమాతృ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ ప్రేమలత, మినిస్ట్రీ ఆఫ్‌యూత్ ఎఫైర్స్ మాజీ సభ్యురాలు లాకేశ్‌ఎంరేఖ, హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వినోద్ శ్రీవాత్సవ తదితరుల చేతులమీదుగా బూసిసువర్ణవేణి ఈ పురస్కారం అందుకున్నారు. అవార్డు అందుకున్న స్కూల్‌అసిస్టెంట్ సువర్ణవేణిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ ఉపాధ్యాయులు అభినందించారు.

లక్ష్మీనరసింహస్వామి అవతారంలో జనార్దనుడు



ధవళేశ్వరం: ధనుర్మాసం సందర్భంగా ధవళేశ్వరం గ్రామంలోని ధవళగిరిపై వేంచేసియున్న శ్రీలక్ష్మీజనార్దనస్వామి ఆదివారం లక్ష్మీనరసింహస్వామి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు(కాసులు), పవన్‌కుమార్ స్వామివారిని అలంకరించారు.

స్టేడియంను అభివృద్ధి చేస్తా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక మున్సిపల్ స్టేడియంను మల్టీపర్పస్ స్టేడియంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర శాప్ చైర్మన్ ఏ.రవి నాయుడు అన్నారు. రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల ప్రాంత యువత జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొనేలా శిక్షణ పొందేందుకు ఇది వేదిక అవుతుందని అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ స్టేడియంను ఆయన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి పరిశీలించారు. ఆర్‌ఎంసీ డీఈ కె.సత్యనారాయణ, వివిధ క్రీడా అసోసియేషన్ నేతలు, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

గోదావరిలో కొట్టుకువచ్చిన మృతదేహం



గోదావరిలో కొట్టుకు వచ్చిన గుర్తుతెలియని మృతదేహం

ధవళేశ్వరం: గోదావరిలో గుర్తుతెలియని పురుషుడి మృతదేహం ధవళేశ్వరం బోట్ ఆఫీసు వీధి పద్మావతి ఘాట్ వద్దకు కొట్టుకువచ్చింది. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం పద్మావతి ఘాట్ వద్దకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చినట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటాయని ధవళేశ్వరం పోలీసులు తెలిపారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబర్ 94407 96586కు సమాచారం ఇవ్వాలని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ కోరారు.